జ్యోతి కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# గూడు చాలని సుఖం

## పి. శ్రీనివాసశాస్త్రి

పూరిపాకల్నీ పేద జనాన్నీ అట్టే పట్టించుకోకుండా చలిగాలులు విజృంభిస్తున్నాయి.

ఆ చలికి సత్తెమ్మ గజగజలాడింది.

అరగంట క్రితం——

కొడుక్కీ కోడలికీ మధ్య తానెందుకు అడ్డు అనిచెప్పి సత్తెమ్మ పాకబైట గోనెబరకం పరచుకు పడుకుంది. అసలు, అత్తాకోడలు లోపల పడుకుంటే కాసులు పాకబైట పడుకోవడం ఆనవాయితీ.

ఓ రాత్రివేళ నరాలు జివ్వుమన్నప్పుడు పిల్లిలా లోపలికెళ్ళి రత్తాల్ని జబ్బమీద గిల్లేవాడు కాసులు.

అది కాస్సేపు గారాలుపోయి, మరికాసేపు వయ్యారాలుపోయి మనసుతీరా బ్రతిమాలించుకొనేది.

కాసులు దాన్ని మెల్లిగా పాకబయటకు నడిపించి నులక మంచంమీదకు చేర్చేవాడు. చాలని నులక మంచం, చాలని దుప్పటీ, చాలని గూడు ఇచ్చే చాలీచాలని సుఖానికి వాళ్లు అలా అలవాటు పడిపోయారు.

పగలల్లా రిక్షా తొక్కీతొక్కీ చాలని గంజి మెతుకులు కడుపులో పడడంవల్ల పెరిగిన ఒంటివేడి రాత్రి ఆ రకంగా తీరిపోగానే కాసులుకి అపుకోలేని అలుపువచ్చి అలాగే నులక మంచంమీద ఒళ్ళెరక్కుండా నిద్రపోయేవాడు.

రత్తాలు వాడికి ఒంటినిండా దుప్పటికప్పి దుప్పటి చిరుగుల్ని ముడతల్తో సరిచేసి లోపలికొచ్చి తడిక బిగించి అత్తపక్కలో పదిలంగా పడుకునేది పాతచీర కప్పుకుని.

కాసులు మొన్న వేసవిలో రత్తాల్ని కాపురానికి తెచ్చుకున్నప్పటినుంచీ ఆ తల్లీ, కొడుకూ కోడలూ పాకని ఆ విధంగా పంచుకున్నారు రాత్రిళ్లు.

సత్తెమ్మ మాత్రం ఆ రోజు తాను కొడుక్కీ కోడలికీ అడ్డుగా వున్నట్లు తలపోసింది. అందుకు కారణం లేకపోలేదు.

అంతక్రితం రాత్రి ముసలమ్మకు మెలకువ వచ్చింది. పక్కలో రత్తాలు లేదు. ఎన్నిసార్లో అలా మెలకువస్తే పక్కలో రత్తాలు లేకపోవడము గమనించి నవ్వుకుని నిద్రలోకి జారుకునేది సత్తెమ్మ. కానీ ఆ రోజు నవ్వురాలేదు. నిద్రారాలేదు. లఘుశంకకి పోవాల్సివచ్చింది. బయటకు వెళ్ళాలంటేలేదు. ఆ సమయంలో బయటనించి సన్నగా వినిపిస్తున్న కొడుకు నవ్వులూ, కోడలి గుసగుసలూ తన అలికిడి వినగానే ఆగిపోతాయని భయం.

రత్తాలు తెలతెలవారుతున్న వేళ పాకలోపలికొచ్చి తడిక బిగించి పదిలంగా తన పక్కలో పాతచీర కప్పుకొని పడుకోడానికి ముందే సత్తెమ్మ ఓ నిశ్చయాని కొచ్చేసింది——

రేపటినుంచి పాకబయట తాను పడుకొని పాకని రాత్రిపూట కొడుకూ కోడళ్ళ స్వేచ్ఛకి వదిలెయ్యాలని.

పడక పడక పడిన కాపురం కాసులుది. కాసులు రిక్షాలాగి తెచ్చే డబ్బులుకాస్తా కోడలికి "కరువైపోడం" అతని తండ్రి వీరయ్యకిష్టం

లేదు. కీళ్ళవాతంవచ్చి ఎటూ కదలలేని వీరయ్యకు, కోడలొస్తే తనకి సారాడబ్బులు అన్నప్పుడూ దక్కవేమోననే భయం పట్టుకుంది.

"కాపురం పడనివ్వ నోడివి—పెళ్లెందుకు చేశావ్ కొడుక్కి?" అని ఇరుగూ పొరుగూ నిలవేశారు వీరయ్యని.

"అడగవచ్చారు కాబట్టి సెబుతున్నా. ఇది గిలారండి. ఈ పాక లోపల అడుగుపెట్టండి. మరో మనిషికి సాల్తదా ఈ పాక? పోనీ ఆ ఒచ్చేమనిషి ఒచ్చినట్టే సరుదుకోవచ్చు. రేపు పిలగాడు పుట్టుకొస్తే మాటేంటి? అందుకే ఓ వందరూపాలు కటుకుపెట్టి నాలుగు తడికెలూ, మూడు తాటిదూలాలూ, ఓ రాట, కమ్మలూ కొని ఏరే ఓగది ఈ పక్కన లేపింతరవాత పెళ్ళాన్ని తెచ్చుకోరా అన్నా. అలా అండం తప్పయితే ఇప్పుడే తెచ్చుకోమనంది పెళ్ళాం బెల్లం ముక్కని! నేనూ నాపెళ్ళాం-అడసలు

లచ్చిమి"ని ఇంటికి తెచ్చుకున్నాడు కాసులు. "మాంగారు" జామారూ, కండువా, చౌకరకం గళ్ళ టెర్లిన్ చొక్కా, రత్తాలుకి చీరా రవికా పెట్టారు. కలగక కలగక కలిగిన కొత్తకాపురం మోజులో కొన్నాళ్ళు రిక్షా లాగుడు వ్యాపారం మూలకి నెట్టేసాడు కాసులు, కుండలు డింకీలు కొట్ట నక్కరలేకుండా మామ ఇచ్చిన 5( రూపాయలూ సహాయపడ్డాయి'

అంతలో వేసవి వెళ్ళిపోయి వర్షాలు ప్రారంభమయ్యాయి. కాసులుకి రాత్రిళ్ళు గూడ సమస్యా ప్రారంభమయ్యింది.

ఆరు బైలుని "వానదేవుడు" ఆక్రమిస్తే పాకని "ముసలమ్మ" ఆక్రమించింది!

ఆ ఇరుకులో కాసులూ, రత్తాలూ పడ్డ 'సుఖం' ఏదైనా వుంటే అది ఎన్నో బాధలనీ, అభ్యంతరాలనీ కాదని సాధించి తెచ్చుకున్నదే!

ఆ చీకట్లో ఇరుకులో వాళ్ళిద్దరి సంభాషణా ముసలమ్మ చెవిన పడుతూనే వుండేది.



మా కొడుకు కాదనిసెప్పి రాములోరి గుడి ముందు సెట్టుకింద బతుకుతాం" అన్నాడు వీరయ్య అడగవచ్చిన ఇరుగూ పొరుగూతో.

వీరయ్య వాదంలో బాధ ఇరుగూపొరుగూ గ్రహించారు. కాసులూ గ్రహించాడు. కానీ ఏం చేయగలడు? పాక బాగుచేతకి వందరూపాయలు లేకనే పోయాయి.

అందుకే వీరయ్య పొమ్మేంతకాలం కాసులు కాపురం పడలేదు.

సరిగ్గా వేసవి వెళ్ళిపోడానికి ముందు "గుహ

"రత్తాలూ....నిద్రపోకే...."

"........"

"రత్తాలూ -నిన్నేనే."

"ష్! గట్టిగా ఇనబడతంది."

"మా అమ్మ నిద్దరోయింది లేయే."

"అందుకే! మాటాడకు! లెగుత్తాది!"

"లెగదు లేయ్....నా మాటిను....అలా పాక ఎనక మట్టి అరుగుమీదికి పోదామా?"

"సీ....సీ....వొరసం....తడిసిపోతాం"

కొత్తలో ఆ ఇరుకుతనం అటు సత్తెమ్మకీ

ఇటు కాసులూ రత్తాలుకీ కొత్తగా వున్నా వర్షాకాలం అంతా ఆ ఇబ్బందికి అలవాటు పడిపోయారు. బైట వాన ఉధృతంగా పడుతుంటే ఆ "హోరు"ని వృధా కానిచ్చేవాడు కాదు కాసులు.

వర్షాకాలం వెళ్ళిపోయి శీతాకాలం మొదలు కాగానే కాసులు ఆరు బైటా, సత్తెమ్మా రత్తాలూ లోపలా పడుకోటంతో సమస్య కొంత

ముసల్దానికీ? ఐనా మీ అయ్యా కంబళీ వుంది కదా?" అంది సత్తెమ్మ.

సత్తెమ్మకిగానీ, కాసులుకిగానీ వీరయ్య వదిలి వెళ్ళినది ఆ పాక, కంబళీ ఆ రెండే. వీరయ్య పోగానే సత్తెమ్మ తన ముక్కెరని రత్తాలుకి తగిలించింది. ఆ ముక్కెరని చెరిపించి బంగారం అమ్మి పాక బాగు చేయించాలని కాసులుకి మనసులో వుండేది. కానీ వీలులేకుండా



విడినట్టే విడింది.

కానీ సత్తెమ్మకి కొత్త సమస్య తల ఎత్తి పడకల మార్పిడి అత్యవసరం అయింది మళ్ళీ!

తల్లి కొత్త నిర్ణయం విన్న తరవాత కాసులుకి ఒకపక్క సంతోషం మరోపక్క విచారం కలిగాయి.

"ఆరు బైట నువు పడుకోరాదని డాకటర్లు సెప్పారు కదే" అన్నాడు మొహమాటంగా.

"ఆరు బైటయితే ఏట్కి, పాకైతే ఏట్రా

ముక్కెర తాకట్టులోకి వెళ్ళి—ఆ తరవాత అత్యంత సహజంగా వాకట్టులోకి వెళ్ళిపోయింది.

కాసులు మనసుపడినట్టుగా ఆ పాకని బాగు చేయించి, తడికెల బదులు పచ్చి ఇటుకలతో గోడలు లేపి పైన రేకులు వేయించి, దాన్ని రెండు గదులు చేసి, ఇల్లు ఆకారం రప్పించాలంటే వాడికి లాటరీ తగాలాలే తప్ప దారిలేదు. లాటరీ టికెట్టుకన్నా రూపాయి డబ్బులుంచాలి కాబట్టి—ఆ పాక ఇక బాగుపడదనే చెప్పాలి

ఆ రోజు పాకని మొత్తానికి కొడుకూ కోడలి స్వేచ్ఛకి వదిలి పాక బైట గోనెబరకం పరచుకొని కంబళీ కప్పుకొని పడుకుంది సత్తెమ్మ.

బైట చలి ఆమెని కుదిపేస్తోంది.

* *

చాలా రోజుల తరవాత రిక్షాకి ఎక్కువ బేరాలు తగిలిన హుషారుతో కాసులు ఆ రోజు 'నన్నెవ్వరాప లేరీవేళ' అన్నట్లున్నాడు.

పాకలోపల సుఖం క్రొత్తగా వుంది.

రత్తాలు కాసులు ఒడి వెచ్చదనానికి కరిగి పోతూవుండ చలిచలి అనడం మానలేదు.

"నే వెచ్చగా లేనా?" అని అడిగాడు కాసులు.

"ఏ పో .." అంటూ చేత్తో కాసులు బుగ మీద పొడిచింది రత్తాలు. గాజులు గల్లున గోల చేశాయి.

కాసులు బాద నటించాడు. రత్తాలు కళ్ళల్లో చురుకుదనం తళుక్కుమంది.

కాసులు పట్టు తప్పిపోయాడు.

ఇద్దరికీ చాలటం లేదు దుప్పటీ.

కప్పుకున్నంత మేరా కొద్దిగా వెచ్చగా అని పించినా, దుప్పటి బైటకి వచ్చిన పాదాలూ, వీపూ చలికి బిర్రబిగుసుకు పోతున్నాయి.

హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చింది కాసులుకి.

"రత్తాలూ! ఓ పనిసై" అన్నాడు.

"ఏటది?" అంది రత్తాలు.

"మా అమ్మ కప్పుకున్నాది కంబళీ....ఈ దుప్పటీ దానికక్కిప్పి, ఆ కంబళీ అట్టుకరా. .. పెద్దగుంటది. ఎచ్చగాకూడా వుంటది. మళ్ళా కోడి కూసే ఏళ కంబళీ కప్పేసి, దుప్పటీ తెచ్చేసుకుందాం."

"ఇయ్యాల నీకు కంబళీమీన మనసు పోనా దేటి?"

"సలనికాదే ఒక్క రేతిరి ఇద్దరం ఒకే పక్కమీన ఒకే దుప్పటికింద పడుకుందామని మనసౌతంది."

"నే మనసు పాడుగాను. దుప్పటుంది కదరా?"

"అది సాల్దే."

"నే తేనుపో"

"సంపుతాను."

"సంపితే వూరుకుంటానా? మెడ కొరికేస్తా అమ్మతల్లిలా."

"నేను సంపేసిం తరవాత నువ్వు నా మెడెలా కొరగ్గలవే?"

"సూపియ్నా? ఇదిగిలా."

రత్తాలు కొరికినందుకు ప్రేమ పెల్లుబికి కితకితలు పెట్టినట్లు నవ్వాడు కాసులు. కదలికకి దుప్పటి సాంతం జారి కిందపడింది.

"సీ. ఇదోటి" అని విసుక్కున్నాడు.

"కంబళీ తెస్తానుండు" అని లేచి తడిక తోసుకుని పాక బైటకొచ్చాడు.

కంబళీతో తల్లి ముడిచిపెట్టుకుని ఉండలా పడుకుంది. కంబళీమీద చేయి వేస్తుంటే గుండె లెందుకో వేగంగా కొట్టుకున్నాయి కాసులుకి.

ఒక్కరేతిరే కదా అని మనసుకి సరిపెట్టు కున్నాడు.

"ముసలమ్మకి ఒకవేళ మెళకువొస్తే...?" అని సందేహం కలిగింది.

మెళకువ రావడానికి అవకాశం ఇవ్వకుండా పదిలంగా కంబళీ తొలగించి దుప్పటీ కప్పి తడిక బిగించి పాకలోపలికొచ్చాడు దొంగలా.

కంబళీ నిండా కప్పుకున్న మొగుణ్ణిచూసి రత్తాలు విరగబడి నవ్వింది "బూచాళ్ళా వున్నావ్" అంటూ.

బూచాళ్ళా వున్నావ్ అన్నందుకు కాసులుకి హుషారుపుట్టి నిజంగానే బూచాళ్ళా నాలికబైట పెట్టి రత్తాల్ని భయపెట్టాడు.


"ముందది ఇలగియ్యి" అంటూ శరీరాన్ని కంబళీలో దాచుకుని వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకుని "ఎచ్చగుంది" అంది రత్తాలు.

"ఇంకా ఎచ్చగుంటది సూడు" అంటూ కాసులుకూడా కంబళీలో దూరిపోయాడు.

ఇద్దరికీ ఉన్నంతలో సుఖం పంచి ఇచ్చింది కంబళీ.

కాస్సేపు వాళ్ళిద్దరి మధ్యనా మాటలు లేవు చేతలేతప్ప. చలిలేదు—వెచ్చటి హాయేతప్ప.

## (వి) చిత్రవిజ్ఞానం



చీనా యువరాణి టూ-వాన్ క్రీ. పూ. 104లో మరణించింది. ఈమధ్య ఆవిడ సమాధి తవ్వగా ఒక కవచం బయటపడింది. దీనితోనే ఆవిడ మృతకాయం కప్పబడిందని తెలిసింది. ఈ కవచం 2,156 పచ్చరాతి పలకలతోనూ, 1,200 తులాల బంగారు తీగలతోనూ నిర్మించబడింది. ఇది ప్రస్తుతం లండన్‌లోని రాయల్ అకాడమీవారి స్వాధీనంలోవుంది. దీని ఖరీదు సుమారు మూడుకోట్ల రూపాయలని అంచనా.

సుఖంతో అలిసిపోయి ఎప్పుడు నిద్ర పోయారో తెలియదు. లేచేసరికి కోడి కూసేసింది. కాసులు బద్ధకంగా ఆవులించి కంబళీ తీసుకుని బైట తల్లిదగ్గర కొచ్చాడు.

కంబళీ కప్పబోతుంటే సత్తెమ్మ ఆయాసంతో రొప్పుతూ, చలికి వణుకుతూ దుప్పటిలో వుండచుట్టుకుపోయి కనిపించింది.

కాసులుకి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

పైకి అనడానికి తనకి నోరు తిరగని జబ్బు ఏదో తల్లికి వుందని మరిచిపోయాడు ఆ రాత్రి.

గబగబా తల్లిని చేతులమీది కెత్తుకుని లోపలికిచేర్చి నులక మంచంమీద పడుకోబెట్టి పాతారోతా బట్టలుకప్పి శరీరాన్ని నీరసంగా గోడకాన్చుకుని కూర్చున్నాడు. పేదతల్లికి పేద కొడుకు చెయ్యగలిగినంతాచేసి ఆపైన భారం "బగుమంతుడి"మీద వేశాడు.

అప్పటికే రత్తాలు గాభరాగా శోకన్నాలు ప్రారంభించడంతో ఇరుగూ పొరుగూ చేరుతున్నారు.

జేబులు తడుముకున్నాడు కాసులు.

చేతికి రెండు రూపాయినోట్లు, ఏవో చిల్లర డబ్బులూ తగిలాయి.

"డాక్టరు దగ్గరికి పోదునా" అని ఆలోచించా డొక్క నిముషం.

"పోతేనే మంచిది. పోకపోతే ఈ ఆయాసం వణుకు, దగ్గుకి ముసలమ్మ సచ్చీసినా అంతకన్నా ఎక్కువే కరుసవుద్ది" అనిపించి గబగబా రిక్షా తీసుకుని "సవక డాట్రుగారి" ఆసుపత్రి వైపు జోరుగా రిక్షా నడిపిస్తూ వెళ్ళిపోయాడు.

సవక డాట్రుగారి అసలుపేరు సుందర్రావు గారు. ఆసుపత్రి బోర్డుమీద ఆయన పేరుచివర ఎల్. ఎం. పి. అని వుంటుంది.

ఎల్. ఎం. పి. అవగానే ఆయన ఏకాయెకి ఆ పేద హరిజనవాడలో ప్రాక్టీసు ప్రారంభించి గుమ్మందాకా వచ్చిన ఏ కేసునీ వదలకుండా ఏదో ఒక మందిచ్చి డాక్టరుదగ్గరికి వెళ్ళామన్న సంతృప్తి పేదలకి మిగిల్చి 'సవక డాట్రుగారని' పేదల్లో పేరుబడ్డారు.

ఆదరాబాదరా రిక్షామీద వచ్చి రొప్పుతూ కాసులు 'ఇసయం' చెప్పగానే ఆయన అంతకన్నా ఆదరా బాదరాగా రిక్షాయెక్కి మరి పది నిమిషాలకి కాసులు పాకముందు నిలబడ్డారు.

పాకలోపలినుంచి జనం అంతా బిలబిలలాడుతూ బయటికి వచ్చి "సవక డాట్రు"గారికి దండాలుచెప్పి అక్కడొకరూ అక్కడొకరూ చెదురుమదురుగా నిలబడ్డారు ఆయనకేసి భక్తితో చూస్తూ.

సవకడాట్రుగారికి నిజానికి ఆ డీల్లో విలు

వయిన సొంతబంగళావుంది. 20 వేలు కట్నం పట్టుకొచ్చిన విలువయిన భార్యవుంది. మామ గారి ఆస్తికి వారసుడైన "పెంపుడు కొడుక్కి" ఏ మాయరోగం రావటంలేదే అనే బాధవుంది. పేద వెధవలు ఎటూ పెద్ద ఆసుపత్రి గుమ్మం కూడా తొక్కలేక తనదగ్గరకే చేరతారనే ధీమా వుంది. రోజులో సగభాగం పేదల పాకదగ్గరే గడిపే అలవాటువల్ల ప్రస్తుతం కాసులు పాక చుట్టూ పరిసరాలుగాని, ఒంటిని సగమే కప్పగల బట్టలు, అమాయకత్వం నిండిన చూపులతో అక్కడ నిలబడ్డ జనంగాని ఆయనలో ఏ సంచలనం కలిగించలేదు.

నవకడాక్టరుగారు పాకనోమారు పరికించి చూసి లోపల రోగిని చేరుకోడానికి తను యెంత వరకు వంగాలో అంచనావేసుకుని, అంతవరకూ వంగి లోపలకు అడుగు పెట్టారు.

మంచంమీద చలితో, ఆయాసంతో, దగ్గుతో ఉండలు చుట్టుకుపోతున్న సత్తెమ్మని చూడగానే ఆయన కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"లాభంలేదు....ఆస్మా .... అశ్రద్ధచేశారు" అన్నారు. మందని కాసులు అనుకున్న రంగు నీళ్ళను సిరంజిలో నింపి ఇంజక్షను యిచ్చారు. ఓ మందులచీటి రాసిచ్చారు. ఖరీదయినవిగా కాసులుకు తోచిన సలహాలు నాలుగిచ్చారు. చివర్న కాసులురిక్షా యెక్కి వచ్చిన దారినే వెళ్ళారు.

కాసులు జేబులుతడిమి మూడురూపాయల చిల్లర ఆయన చేతిలో పొయ్యగానే కళ్ళజోడు సందులోంచి పరీక్షగాచూసి "రానుపోను రిక్షాకి డబ్బులు ఖర్చవలేదు కాబట్టి లాభమే" అనుకొని వ్యాపార ప్రకటనలాంటి మేలురకపు నవ్వునవ్వారు.

"ఇండీసను పొడిచేరు కాబట్టి నవకే. ." అని కాసులు అనుకుని "దండాలుబాబూ" అంటూ వంగి వంగి సలాముచేసి అజ్ఞానపు, అమాయకత్వపు నవ్వు నవ్వాడు.

ఆ తరవాత సత్తెమ్మ ఆయాసం, కాసులు దిగులూ, రత్తాలి శోకన్నాలు ఆ వెనుక ఇరుకూ పొరుగూ సానుభూతి వాక్యాలూ మామూలుగానే మిగిలిపోయాయి.

డాక్టరుగారిచ్చిన సలహాలలో ఖరీదయినవి ఎప్పుడో మర్చిపోయాడు కాసులు. జ్ఞాపకానికి ఇక మిగిలిందల్లా చవకబారు సలహా ఒక్కటే-

"ఆరుబయట పడుకో బెట్టకండి" అన్నది.

తన సుఖం కొంత ఖరీదుగా ముట్టచెబితే ఈ సలహా పాటించడం చాలా సుళువు.

వెంటనే ఆరాత్రి ఆ సలహా పాటించేశాడు.

మళ్ళీ యథాప్రకారం సత్తెమ్మ పడక పాకలోకీ, కాసులు పడక ఆరుబయటికీ మారిపోయాయి.

అదే నులకమంచం .

అదే చిరుగుల దుప్పటీ...

అదే ఇరుకు సుఖం.

అన్నింటికీ అలవాటు పడిపోయి ఆ శీతాకాలం నాలుగునెలలూ గడిపేశాడు.

వేసవి వెళ్ళి, ఆ వెనుకనే వర్షాకాలంకూడ వెళ్ళిపోతుండగా సత్తెమ్మ కన్నుమూసింది తిరగబెట్టిన ఆస్మా తగ్గక.

ఆ పాక యిక శాశ్వతంగా కాసులుదీ రత్తాలుదీనూ!

అలా అని గట్టిగా అనుకోడానికిలేదు.

అప్పటికే కొడుక్కి మూణ్ణెల్లు నిండగా రత్తాలు మళ్ళా కడుపుతోంది.

"ఈ ఇరుకు బతుకుతో ఎప్పుడూ మూడో వాడికి చోటుండటంలేదు. నువ్వెందుకొచ్చావురా ఈ పాకలోకి? ఏరే ఏదన్నా కలిగిన లోగిలి చూసుకోలేక పోయావా?" అని కొడుకు పుట్టిన రోజున కాసులు బాధపడితే రత్తాలుకళ్ళ నీరెట్టుకుంది.

"ఈసారి మగబొట్టె నియ్యకురా దేవుడా! ఆడబిడ్డనియ్యి——" అని రత్తాలు దేముణ్ణి ప్రార్థిస్తూ వుంటుంది కాసులుకి తెలీకుండా.

మరో కొడుకు పుడితే ఆ ఇరుకుపాకలో మరో వాటాకి పోటీ వస్తుందని రత్తాలు భయం!

ఒకసారి ఆమాట కాసులుతో అనగానే వాడు పగలబడి నవ్వాడు. ఎందుకు నవ్వాడో ఆలోచిస్తే వాడికే అంతుచిక్కలేదు.

వాడి ఇరుకు బతుకులో సుఖం ఎంతుందో వాడి నవ్వులో అర్థమూ అంతే వుంది! □